
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కర్నూలు
జిల్లా వార్తలు
3
సోమవారం 21 జూలై 2025

2018 ఆగస్టు 3.. రాత్రి 9గంటల సమయం.. హత్తిబెళగల్ కొండల్లోని క్వారీల్లో ఒక్కసారిగా భారీ పేలుడు.. ఒకరు, ఇద్దరు కాదు ఏకంగా పది మంది కూలీలు సజీవ దహనమయ్యారు. ఆఘటన అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలన సృష్టించింది. దీంతో ప్రభుత్వం క్వారీలను మూసివేయించింది. క్వారీ యజమాని శ్రీనివాస్‌చౌదరితో పాటు మరికొందరిపై కేసులు కూడా నమోదు చేశారు. అలాంటి దుర్ఘటన జరిగిన ప్రాంతంలో తిరిగి క్వారీలకు అనుమతులు ఇవ్వడంపై ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారు. క్వారీల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. క్వారీ ఏర్పాటుకు ఇబ్బందులు, ప్రజల నుంచి అభ్యంత రాలు ఉంటే విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించడంతో జిల్లా మైనింగ్‌శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సమయంలో గ్రామం మొత్తం క్వారీ అనుమతులు రద్దుకు డిమాండ్ చేశారు. ఈవిషయంపై కలెక్టర్‌కు నివేదిక ఇస్తానని జిల్లా మైనింగ్‌శాఖ డీడీ తెలిపారు. ఏదిఏమైనా హత్తిబెళగల్ క్వారీలు అంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు.


క్వారీలో పేలుళ్లు జరిగిన ఘటనపై పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

హత్తిభయంగల్

- ప్రమాదమని తెలిసినా క్వారీకి అనుమతులు
- ఏడేళ్ల క్రితం భారీ పేలుళ్లతో 10మంది కూలీలు మృత్యువాత
- మైనింగ్ శాఖ అధికారులను అడ్డుకున్న గ్రామస్థులు
- అనుమతుల రద్దుకు డిమాండ్
- వెనుదిరిగి వెళ్లిన అధికారులు

ఆలూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): హత్తిబెళగల్‌లో వాసులు భయంతో వణికిపోతున్నారు. 2018 ఆగస్టు 3వ తేదీన హత్తిబెళగల్ క్వారీలో జరిగిన భారీ పేలుళ్లలో పది మంది కూలీలు సజీవ దహనం అయ్యారు. అదే కొండల్లో తిరిగి క్వారీ నిర్వహణకు మైనింగ్ శాఖ అనుమతులు ఇవ్వడంపై ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. క్వారీ అనుమతులు రద్దు చేయాలంటూ గ్రామస్థులు కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మైనింగ్ అండ్ జియాలజీ డిప్యూటీ డైరెక్టర్ రవిచంద్ శనివారం గ్రామానికి క్వారీ పరిశీలన కోసం రాగా అడ్డుకున్నారు. క్వారీ రద్దుకు డిమాండ్ చేశారు. కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్తామని హామీ ఇచ్చి వెళ్లిపోయారు.

20 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు...

హత్తిబెళగల్ కొండల్లో క్వారీని నిర్వహించేందుకు 16-5-2005లో సర్వేనంబర్ 969సీలో 8925 హెక్టార్ భూమిని గుంతకల్‌కు చెందిన బి.శేఖర్‌కు క్వారీని 20 యేళ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను అప్పటి తహసీల్దార్ రంగన్న మైన్స్ అండ్ జియాలజీ కర్నూలు డిప్యూటీ డైరెక్టర్‌కు జారీ చేశారు. ఈ మేరకు అప్పట్లో జనాభా గ్రామం వెలుపల ఉండేవారు. జనాభా పెరిగే కొద్దీ కొండకి దగ్గరగా నివాసాలు వెలిశాయి.

10 మంది కూలీలు సజీవ దహనం కావడమే..

హత్తిబెళగల్ కొండల్లో మరో క్వారీలో జిలిటెన్ స్టిక్స్ పేలి జార్ఖండ్‌కు చెందిన 10 మంది కూలీలు 2018లో సజీవ దహనమయ్యారు. గ్రామంలో క్వారీకు సమీపంలో ఉన్న ఇల్లు చీలికలు ఏర్పడ్డాయి. దీంతో ఒక్కసారిగా ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. దీంతో ప్రభుత్వం క్వారీలను మూసివేయించి క్వారీ యజమాని శ్రీనివాస్‌చౌదరితో పాటు మరికొందరిపై కేసులు కూడా నమోదు చేశారు.

2021లో క్వారీ నిర్వహణకు...

భారీ పేలుళ్ల ఘటన మరువకముందే జూలై 16, 2021లో మైనింగ్ శాఖ అధికారులు అనంతపురం జిల్లా రాయలచెరువుకు చెందిన శాంత పేరు మీదుగా క్వారీ నిర్వహణకు అనుమతులు ఇచ్చారు. దీంతో ఆరు నెలలుగా కొండల్లో క్వారీని స్టార్ట్ చేసేందుకు రహదారులు ఏర్పాటుచేసి సిద్ధంచేసుకున్నారు. గమనించిన గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. క్వారీ ఏర్పాటుకు ఇబ్బందులు, ప్రజల నుంచి అభ్యంతరాలు ఉంటే విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించడంతో జిల్లా మైనింగ్‌శాఖ అధికారులు పరిశీలన చేశారు. ఈ సమయంలో గ్రామం మొత్తం క్వారీ అనుమతులు రద్దుకు డిమాండ్ చేశారు. విషయంపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇస్తానని జిల్లా మైనింగ్‌శాఖ డీడీ రవిచంద్ తెలిపారు. మరోవైపు ఈ వ్యవహారంలో ప్రభుత్వం తిరిగి అనుమతులు ఇచ్చే సమయంలో మరో సారి రెవెన్యూ అధికారుల నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోకుండా అనుమతులు ఇవ్వ డంపై మైనింగ్‌శాఖ అధి కారులపై విమర్శ లు వెల్లువెత్తుతున్నాయి. క్వారీ నిర్వహణపై ప్రభు త్వం మరోసారి విచార ణ జరిపి ప్రజాభి ప్రాయాన్ని పరిగణలోకి తీసుకోవాలని గ్రామస్థులు కోరుతన్నారు.


క్వారీపై వచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

అభిప్రాయ సేకరణను తీసుకోకుండా..



2018లో క్వారీలో జరిగిన పేలుళ్ల ఘటనలో పది మంది మృతిచెందారు. 2021లో కనీసం రెవెన్యూ అధికారుల, ప్రజల నుంచి ఎలాంటి అభిప్రాయ సేకరణను తీసుకో కుండా మైనింగ్‌శాఖ తిరిగి ఇదే ప్రాంతంలో మైనింగ్ నిర్వహణకు అనుమతులు ఇవ్వడం సరికాదు. ప్రభుత్వం మరోసారి ప్రజాభిప్రాయ సేకరణను చేపట్టి క్వారీ అనుమతులు రద్దు చేయాలి.

- కమలాకర్‌నాయుడు, గ్రామస్థుడు, హత్తిబెళగల్

తల్లికి వందనం పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

కర్నూలు న్యూసిటీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకానికి అర్హులై.. అనర్హుల జాబితాలో ఉన్న వారు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిషత్ సీఈవో జి.నాసరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారని తల్లికి వందనం తిరస్కరిస్తే సంబంధిత ప్రభుత్వ కార్యాలయం డీడీవో నుంచి ఎవరూ ప్రభుత్వ ఉద్యోగం చేయడం లేదని ఓ లెటరు సమర్పించాలని తెలిపారు. ఆదాయ పన్ను చెల్లించడం లేదని, వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు లేదని, పది ఎకరాల కంటే ఎక్కువ భూమి లేదని, కుటుంబంలో ఎవరికీ నాలుగు చక్రాల వాహనం లేదని, 300 యూనిట్లకు మించి కరెంటు వాడటం లేదని తగిన ఆధారాలతో సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ విషయాలను తల్లిదండ్రులు క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సీఈవో విజ్ఞప్తి చేశారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి

- ఘనస్వాగతం పలికిన మఠం అధికారులు

మంత్రాలయం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీషానంద ఆదివారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మహాముఖ ద్వారం వద్ద ఈయనకు మఠం మేనేజర్లు ఎస్.కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, సురేష్ కోణాపూర్, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘన స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పండితులు జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదమిచ్చి ఆశీర్వదించారు. ఈయన వెంట ఎస్ఐ శివాంజల్, జేపీస్వామి, స్వామిరాయ్, జయతీర్థఆచార్, వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.

కామేశ్వరీదేవికి పుట్టింటి పట్టు చీర

- మహిళలకు ఘనస్వాగతం పలికిన ఆలయాధికారులు


అమ్మవారికి ఆషాఢం చీర, సారె తీసుకెళ్తున్న సేవాసమితి మహిళలు

మహానంది, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం పురస్కరించుకొని మహానంది క్షేత్రంలోని కామేశ్వరీదేవి అమ్మవారికి బాలాజీ సేవా ట్రస్ట్‌కు చెందిన వందలాది మంది మహిళలు పుట్టింటి పట్టుచీర కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరికి క్షేత్ర సమీపంలోని గరుడ నందీశ్వరుని ఆలయం వద్ద ఆదివారం ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, వేదపండితులు స్వాగతం పలికారు. అనంతరం సేవా సమితి కి చెందిన మహిళలు శోభ యాత్ర నిర్వహిస్తూ భక్తి పారవశ్యంతో కోలాటం, భజనలు చేస్తూ మాడవీధుల ద్వారా ప్రధాన ఆలయం వద్దకు చేరుకున్నారు. కామేశ్వరీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆషాడం సారెగా పట్టువస్త్రాలను ఆలయ అర్చకులకు అందచేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు సరికొత్తగా ఆలోచించాలి

- శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ అభివృద్ధి చెందుతోంది
- ఇస్రో చైర్మన్ చైర్మన్ డాక్టర్ నారాయణన్
- ఘనంగా కర్నూలు ఐఐఐటీడీఎం 7వ స్నాతకోత్సవం


కర్నూలు ఐఐఐటీడీఎం స్నాతకోత్సవంలో పాల్గొన్న ఇస్రో చైర్మన్

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిత్యం సరి కొత్తగా ఆలోచించాలని ఇస్రో చైర్మన్‌డాక్టర్ వి.నారాయణన్ సూచించారు. కర్నూలు నగరం సమీపంలోని జగన్నాథగట్టుపై ఉన్న భారత సమాచార సాంకేతికత, రూపకల్పన, తయారీ సంస్థ (ఐఐఐటీడీఎం) 7వ స్నాతకోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నారాయణన్ హాజరై ప్రసం గించారు. దేశంలో శాస్త్రీయ అభివృద్ధిని గ్రామీణాభివృద్ధితో అ నుసంధానించాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్రం అనంతరం భారత్ విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో సాధించిన అసాధారణ విజయాల గురించి ఆయన వివరించారు. 104 ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించడం భారత్ సామర్థ్యానికి నిదర్శనమని అన్నారు. సమాచార రంగంలో జరిగిన అభివృద్ధిలో దేశపు మౌలిక సదుపాయాలను మెరుగుపరిచాయన్నారు. వ్యవసాయం, ఆరోగ్య రంగాల్లో దేశం సాధించిన పురోగతి గురించి వివరించారు. ప్రస్తుతం భారత ఆహార ధాన్యాలను ఎగుమతి చేసే స్థాయికి చేరిందని, మెడికల్ టెక్నాలజీలో విప్లవాత్మక అభివృద్ధి జరుగుతోందని వివరించారు.


మాట్లాడుతున్న డాక్టర్ నారాయణన్


మిగతా 5వ పేజీలో

మంత్రాలయంలో భక్తుల రద్దీ

మంత్రాలయం, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో సందడిగా మారింది. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని పండితుల ఆశీస్సులు పొందారు.


భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీమఠం ప్రాంగణం

శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద


నిండుకుండలా శ్రీశైలం జలాశయం

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి స్థిరంగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ ఉన్న జూరాల, సుంకేసుల నుంచి జలాశయం నుంచి 1,56,516 క్యూసెక్కుల వరద శ్రీశైలం చేరుకుంటోంది. కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాలకు 87,525 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882.50 అడుగులకు చేరింది.

బలవంతపు భూసేకరణ ఆపాలి

నంద్యాల రూరల్, జూలై20 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరుతో రైతన్నల జీవనాధారమైన భూములను బలవంతంగా సేకరించడం ఆపాలని రైతుసంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నేషనల్ పీజీ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక భూసేకరణ విధానాలపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్, గ్రీన్ ఎనర్జీల పేరుతో బలవంతంగా రైతుల వద్ద నుంచి భూము లను సేకరించి ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడం రైతులకు తీవ్రద్రోహం చేసినట్లేనని ఆరోపిం చారు. చట్టబద్ధమైన రీతిలో భూసేకరణ చేయకుండా అధికారం ఉందని ఇష్టం వచ్చినట్లు చేయడం సరికాదన్నారు. రైతు కుటుంబాల భావిజీవితాలకు తీరని విఘాతం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు.

ఎంఈవోలకు ముఖ హాజరు తప్పనిసరి

- పనితీరు మెరుగుకు ప్రభుత్వం చర్యలు
- విధిగా రోజుకో పాఠశాల తనిఖీ
- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్



ఆలూరు మండల విద్యాశాఖాధికారి కార్యాలయం

ఆలూరు, జూలై20(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ అధికారులు ఇక నుంచి ఉదయం 9 గంటలకే ముఖ హాజరు వేయాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీంతో ఇక ఎప్పుడు పడితే అప్పుడు వెళ్లి రావచ్చనే వారికి చెక్ పడనుంది. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు ఎంఆర్‌సీలకు వెళ్లి ఆన్‌లైన్‌లో ముఖ హాజరు వేయాలి. ఏదో ఒక పాఠశాలను తనిఖీ చేయాలి. ఈ మేరకు విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలల పర్యవేక్షణ, విద్యా పథకాల అమలు, హెచ్‌ఎంలు, టీచర్ల పనితీరు, ప్రమాణాలను పర్యవేక్షించడానికి మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్(ఎంఈవో)ను ముందు నుంచి నియమించారు. గత వైసీపీ పాలనలో ప్రతి మండలానికి అదనంగా ఎంఈవో-2ను నియమించారు. ఈ లెక్కన కర్నూలు జిల్లాలో 25 మండ లాలకు ఇద్దరిద్దరు ఉన్నారు. అయినా పాఠశాలల పర్యవేక్షణ గాడిన పడలేదు. పైగా ఇద్దరు ఎంఈఓలు ఉండడంతో అనేక మండలాల్లో ఆధిపత్యపోరు మొదలైంది. ఇంకోవైపు చాలా మంది ఎంఈవోలు స్థానికంగా ఉండడం లేదు. జిల్లా, డివిజన్ కేంద్రం లోనే నివాసం ఉంటున్నారు. దీనితో పని వేళలు పాటించడం లేదు. ఎప్పుడో వెళ్లి హాజరు వేసుకుం టున్నారు. కొందరైతే జిల్లా కేంద్రంలో ఉంటూ ఇక్కడి నుంచే ఏదో ఒక పని కారణం చూపి ముఖ హాజరు నమోదు చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఎంఈవోలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో కమిషనర్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రకారం ఎంఆర్‌సీలలో పనిచేస్తున్న సీఆర్‌పీలు, ఆపరేటర్లు, ఇతర కింది స్థాయి సిబ్బంది కూడా ఉదయం 9 గంటలకే ముఖ హాజరు వేయాల్సి ఉంటుంది.

హాజరు, తనిఖీలపై రోజూ నివేదిక

తోచిన కారణాలు చెప్పి తప్పించుకోవడానికి అవకాశం లేకుండా ఎంఈఓల మెడకు కమిషనర్ కత్తి బిగించారు. టీచర్ల మాదిరిగానే ఉదయం 9.30 గంటలకు ఎంతమంది ఎంఈవోలు హాజరు వేసిందీ జిల్లా విద్యాశాఖ ప్రతిరోజూ కమిషనరేట్‌కు నివేదిక పంపించాలి. ప్రతిరోజూ ఒక పాఠశాలను ఎంఈఓ తప్పనిసరిగా తనిఖీ చేయాలి. గతంలో కొందరు ఎంఈవోలు డివిజన్ కేంద్రం నుంచి ఎప్పుడో బయలుదేరి దగ్గర ఉన్న పాఠశాలలకు వెళ్లి తూతూ మంత్ర ంగా తనిఖీలు చేసి హాజరైనట్లు నమోదు చేసుకునేవారు. ఇప్పుడు అలాకాకుండా ఎంఈవోలకు జీపీఎస్ విధానం అమలు చేస్తున్నారు. ఎంఆర్‌సీకి వెళితే అక్కడ లోకేషన్ చూపిస్తుంది. పాఠశాలలకు వెళితే అక్కడి లోకేషన్ చూపిస్తుంది. ఈ కొత్త ఉత్తర్వులు ఎంఈవోలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నది.

ఎంఈవోలు ముఖ హాజరు వేయాల్సిందే



ఎంఈవోలు కూడా ఇప్పటి నుంచి ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు ఎంఆర్‌సీలకు వెళ్లి ముఖ హాజరు వేయాల్సిందే. రోజూ ఒక పాఠశాలను తప్పనిసరిగా తనిఖీ చేయాల్సిందే. హాజరుపై రోజూ 9.30 గంటలకు కమిషనరేట్‌కు సమాచారం ఇస్తాం.

- శామ్యూల్ పాల్, డీఈవో, కర్నూలు

భూమి, భుక్తి కోసం సాయుధ పోరాటాలు

- జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య

కర్నూలు న్యూసిటీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): వంద సంవత్సరాల చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీ అనేక ఉద్యమాలు నడిపి భూమి, భుక్తి కోసం సాయుధ పోరాటాలు చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య పేర్కొన్నారు. ఆగస్టు 9, 10, 11 తేదీల్లో జరిగే సీపీఐ 24వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో దేవనగర్ రైల్వేగేట్ నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థి, యువజన, మహిళా సంఘాల ఆధ్వర్యంలో జనసేవాదళ్ కవాతు నిర్వహించారు. ఈమహాసభలకు రాష్ట్ర కార్యదర్శి కే.రామక్రిష్ణతో పాటు అనేక మంది రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొని మూడు రోజుల పాటు జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చిస్తారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లెనిన్‌బాబు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కే.జగన్నాథం, జిల్లా కార్యవర్గసభ్యులు కారుమంచి, విరుపాక్ష, జి.చంద్రశేఖర్, సి.మహేష్ పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వచ్చి వెళ్తూ...

- ఎల్లెల్సీలోకి దూసుకెళ్లిన కారు
- ఇద్దరు యువకుల గల్లంతు
- ఒకరి మృతదేహం లభ్యం.. మరొకరి కోసం గాలింపు

5

ప్రిన్సిపాల్‌కు నేషనల్ అవార్డు

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గ్లోబల్ సంస్థ కర్నూలు బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.నాగస్వామి నాయక్‌కు రవీంద్రనాథ్ ఠాగూర్ నేషనల్ అవార్డు ఫర్ ఎడ్యుకేషనల్ లీడర్‌షిప్ అవార్డు అందజేసింది. ఈ అవార్డును ఈమెయిల్ ద్వారా ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌కు అందజేశారు. విద్యారంగంలో సమకాలిన మార్పులకు అనుగుణంగా సమిళిత దృక్పథంతో వినూత్నమైన పద్ధతులను రూపకల్పన చేయడంలో విశేషమైన సేవలందించినందుకు గానూ ఈ అవార్డులను సంస్థ ప్రదానం చేసింది. మార్చి 2025లో జరిగిన ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో కళాశాలలో విద్యార్థులు 82.02 శాతం ఉత్తీర్ణతతోనూ, 2025-26 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో అత్యధిక అడ్మిషన్లు పొందడానికి విశేష కృషి చేసినందుకు గానూ కళాశాల ప్రిన్సిపాల్‌ను టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా అవార్డును అందుకున్నందుకు ప్రిన్సిపాల్‌ను బోధన, బోధనేతర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

నామినేటెడ్ పదవులు ఇవ్వడం అభినందనీయం

- బలిజ సంఘం, 'రోపా' నాయకులు



సన్మానిస్తున్న రోపా, బలిజ సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బలిజలకు నామినేటెడ్ పదవులలో అవకాశం కల్పించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని కర్నూలు జిల్లా బలిజ సంఘం అధ్యక్షుడు కోనేటి చంద్రబాబు, రాయల్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (రోపా) అధ్యక్షుడు చింతలపల్లి రామకృష్ణ, జనరల్ సెక్రటరీ కోనేటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం రోపా ఆధ్వర్యంలో బలిజల ఆత్మీయ సమావేశం నగరంలోని డీవీఆర్ హోటల్‌లో నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న మైలేరీ మల్లయ్య సతీమణి మైలేరి సురేఖకు, ఉలిందకొండ సింగిల్ విండో నూతన చైర్మన్ యుద్ధం వెంకటరమణను ఘనంగా సన్మానించారు. ఎంపికకు సహకరించిన ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిలప్రియకు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి బలిజ సంఘం తరుపున కృతజ్ఞతలు తెలిపారు. జనసేన నాయకులు చింతా సురేష్, జావాజీ రేఖ, పసుపుల పవన్ కుమార్, కొణిదెల శ్రీనివాస్, పూజల రాము, కొండా విజయ్, కర్నూలు జిల్లా బలిజ సంఘం, రోపా సభ్యులు కొట్టె చెన్నయ్య, బీపీ శ్రీనివాసరావు, దంతెల రమణ, యుద్ధం శ్రీకాంత్, తుళువ గోపాల్, రామనాథ్, బాలరాజు, సుబ్రహ్మణ్యం, బత్తుల గంగాధర్, కామినేని వెంకటేశ్వర్లు, గన్నపురెడ్డి శ్రీనివాస్, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వచ్చి వెళ్తూ...

- ఎల్లెల్సీలోకి దూసుకెళ్లిన కారు
- ఇద్దరు యువకుల గల్లంతు
- ఒకరి మృతదేహం లభ్యం.. మరొకరి కోసం గాలింపు
- నలుగురిని కాపాడిన వ్యవసాయ కూలీలు

ఆరుగురు యువకులు మంచి స్నేహితులు. కర్ణాటక రాష్ట్రం దార్వాడ జిల్లా హుబ్లీ దగ్గర ఓ కంపెనీలో కార్మికులుగా పనిచేస్తున్నారు. శని, ఆదివారాలు సెలవుకావడంతో రాఘవేంద్రస్వామి దర్శించుకునేందుకు కారులో వచ్చారు. స్వామివారిని దర్శించుకొని తిరుగు ప్రయాణం అయ్యారు. కొప్పల్ దగ్గర ఉన్న గవిమఠాన్ని సందర్శించుకోవాలని అనుకున్నారు. వారు వెళ్తున్న కారు అతివేగంగా కౌతాళం సమీపంలో ఎల్లెల్సీ కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు గల్లంతు అయ్యారు. కాగా వారిలో ఒకరి మృతదేహం లభ్యమైంది. మరో నలుగురు యువకులను కాలువగట్టుపై భోజనాలు చేస్తున్న రైతు కూలీలు సురక్షితంగా కాపాడారు. కాగా ప్రమాదానికి అతివేగమే కారణమని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.



ఎల్లెల్సీ కాలువలో నుంచి కారును బయటకు తీస్తున్న దృశ్యం



సునీల్ మృతదేహం

కౌతాళం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనానికి వచ్చి వెళ్తూ ఓ కారు అతివేగంతో ఎల్లెల్సీలోకి దూసుకెళ్లింది. ఈ ఘట నలో ఇద్దరు గల్లంతు కాగా ఒకరి మృతదేహం లభించింది. మరొకరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కారులో ఉన్న మిగతా నలుగురిని రైతు కూలీలు సురక్షితంగా కాపాడినట్లు కౌతాళం సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం దార్వాడ జిల్లా హుబ్లీలోని ఓ కంపెనీలో సునీల్, మణికంఠ, హైదర్, మంజునాథ్, అప్పయ్య, అభిషేక్ కార్మికులుగా పని చేస్తున్నారు. వీరంతా 25ఏళ్లలోపు యువకులే. మంచి స్నేహితులు. శని, ఆదివారాలు సెలవులు రావడంతో మంత్రాలయానికి రాఘవేంద్రస్వామిని దర్శనార్థం కారులో వచ్చారు. దర్శనం ముగించుకొని ఆదివారం మధ్యాహ్నం స్వగ్రామానికి బయలుదేరారు. కొప్పల దగ్గర ఉన్న గవిమఠం క్షేత్రాన్ని దర్శించుకొని అక్కడి నుంచి హుబ్లీకి రాత్రికంతా చేరుకోవాలనుకున్నారు. అతివేగంతో కారు కౌతాళానికి సమీపంలోని ఎల్లెల్సీ కాలువలోకి దూసుకెళ్లింది. మణికంఠ, సునీల్ (21) కాలువనీటిలో గల్లంత య్యారు. సునీల్ మృతదేహం లభ్యమైంది. మణికంఠ ఆచూకీ కోసం చీకటి పడినా ఎస్డీఆర్ఎఫ్ రెస్క్యూ టీం, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు కొనసాగించారు. తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, మంత్రాలయం సీఐ రామాంజులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

అప్రమత్తమైన వ్యవసాయ కూలీలు

కౌతాళం మండల టీడీపీ నాయకుడు వెంకటపతిరాజు పొలంలో పనుల కోసం వచ్చిన ఎరిగేరి, లక్ష్మీనగర్ క్యాంపులకు చెందిన వ్యవసాయ కూలీలు గొట్టయ్య, గోవర్ధన్, రమేష్ ఆదివారం మధ్యాహ్నం 2.30గంటల సమ యంలో ఎల్లెల్సీ కాలువ గట్టుపై భోజనాలు చేస్తున్నారు. ఆసమయంలో కుప్పగల్ నుంచి కౌతాళం వైపు వేగంగా వెళ్తున్న కారు కాలువ లోకి దూ సుకెళ్లింది. గట్టుపై భోజనం చేస్తున్న కూలీలు క్షణాల్లో అప్ర మత్తమయ్యారు. కాలువలో పడిన కారులోని యువకులను కాపా డేం దుకు ముందుకు వచ్చారు. హైదర్, మంజునాథ్, అప్పయ్య, అభిషేక్‌ను సురక్షితంగా కాపాడారు. వీరిలో ఇద్దరికి ఈత వస్తుండడంతో కారులో నుంచి అతి కష్టంమీద బయటకు వస్తుండగా కూలీలు వారిని ఒడ్డున చేర్చి ప్రాణాలను కాపాడారు. అప్పటికే ఇద్దరు యువకులు గల్లంతయ్యా రు.

ఎక్స్‌కవేటర్ సహాయంతో..

ఎల్లెల్సీలోకి కారు దూసుకుపోయిందనే సమాచారం తెలియగానే సీఐ అశోక్‌కుమార్, సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. అప్పటికే కూలీలు నలుగురు యువకులను కాపాడారు. ఎక్స్‌కవేటర్ సహాయంతో కాలువలోని కారును బయటకు తీశారు. సునీల్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరు మిత్రులను కోల్పోవడం ఎంతో బాధగా ఉందని, ఆ రాఘవేంద్రస్వామియే మమ్మల్ని కాపాడారని, ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడిన యువకులు పేర్కొన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



ఏమిటీ దుస్థితి...?

కొండల నడుమ పచ్చని వృక్షాలు.. సెలయేటి గలగలలు.. పక్షుల కిలకిలరావాలు.. ఆధ్యాత్మికత శోభ.. ఇదీ కాల్వబుగ్గ రామేశ్వరస్వామి క్షేత్రం. శుభాకార్యాలు జరుపుకునేందుకు అనువైన ప్రాంతం కావడంతో శివాలయాన్ని కట్టించారు. భూగర్భజలాలు ఉబికివచ్చే ప్రాంతంలో కోనేర్లను నిర్మించారు. దాదాపు 200 ఏళ్ల క్రితం విషయాలు ఇవి. ఎనిమిదేళ్ల నుంచి పరిస్థితి ఇందుకు భిన్నంగా మారింది. చిన్న, పెద్ద కోనేరులు ఒక్కసారిగా ఎండిపోయాయి. అభిషేకానికి సైతం బోరు నీరే వాడాల్సి పరిస్థితి. దీంతో ఇక్కడి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో సైతం దేవదాయ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

- శివలింగం అభిషేకానికి బోరు నీరే శరణ్యం
- కాల్వబుగ్గ క్షేత్రంలో ఎండిపోయిన కోనేర్లు
- బోర్లతో చిన్నకోనేరులోకి నీటి సరఫరా
- ఇబ్బందులు పడుతున్న భక్తులు
- అప్పట్లో తాగు, సాగునీరు కూడా అందేది
- బీళ్లుగా మారుతున్న పరిసర పొలాలు

ఓర్వకల్లు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వర స్వామి క్షేత్రంలో కోనేర్లు ఎండిపోయాయి. ఈ ఆలయంలో ఎన్నడూ లేనివిధంగా నీటిఎద్దడి నెలకొంది. చిన్న కోనేరు, పెద్దకోనేరు నీళ్లతో కళకళలాడిన కాల్వబుగ్గ క్షేత్రం నేడు నీరులేక వెలవెలబోతోంది. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు సైతం నీరులేక ఇబ్బందులు పడుతున్నారు. నీటి సమస్యను తీర్చేందుకు చిన్న కోనేటి సమీపంలో రెండు బోర్లు వేసినా వాటిలో కూడా నీరు అంతంత మాత్రమే వస్తుంది. అరకొర నీటినే పైపులైన్ ద్వారా చిన్న కోనేటికి వదులుతున్నారు. ఒకప్పుడు కాల్వబుగ్గ పుష్కలమైన నీటి వనరులు భక్తులను ఆహ్లాదపరచడమే కాకుండా హుశేనాపురం, కాల్వ గ్రామాలకు చెందిన 300 ఎకరాలకు నీటి సౌకర్యం విపరీతంగా ఉండేది. అయితే.. ఏడు గ్రామాలకు తాగునీరు కూడా అందించేది. ప్రస్తుతం నీరు లేకపోవడంతో ఆపొలాలు బీళ్లుగా మారాయి. వర్షాలు లేక భూగర్భజలాలు ఇంకిపోయాయి. పెద్దకోనేటిలో చుక్కనీరు కూడా లేదు. కోనేటిని చూసిన భక్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రసిద్ధి చెందిన కాల్వబుగ్గ రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో ప్రతి యేటా కొన్ని వందల వివాహాలు జరుగుతాయి. అనేక శుభకార్యాలకు వేదిక, వేల సంఖ్యలో భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా క్షేత్రం ప్రాభవం కోల్పోయే ప్రమాదాన్ని నెలకొంటుంది. భక్తులకు నీటి కష్టాలను తీర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అధికారులు చేయలేదు. ఎనిమిదేళ్లగా వర్షం వస్తేనే కోనేరుల్లో నీరు.. ఎండాకాలమంతా ఒట్టిపోయిన కోనేటిలు దర్శనమిస్తున్నాయి. వీటిపైన దేవదాయశాఖ అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే వర్షాకాలంలో భారీ వర్షాలు పడిన సమయంలోనే రెండు కోనేర్లు కొద్ది రోజులు నీటితో కళకళాలాడుతాయి.



ఎండిపోయిన కాల్వ

నీరులేక వెలవెల



కాల్వబుగ్గ క్షేత్రంలో నీటి బుడగలు ఎండిపోయాయి. గతంలో నీటితో కళకళలాడే కోనేర్లు నీరు లేక వెలవెలబోతున్నాయి. నీటి బుడగలు 300 ఎకరాలకు నీరు అందించేది. ప్రస్తుతం ఎనిమిదేళ్ల నుంచి నీరు కరువైంది. వర్షాలు లేకపోవడంతోనే ఇలాంటి పరిస్థితి ఏర్పడింది.

- గొల్ల నాగరాజు, భక్తుడు

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి



క్షేత్రంలో నీటి బుడగలు ఇంకిపోయాయి. పుణ్యక్షేత్రం పైన విపరీతంగా బోర్లు వేశారు. వీటితోనే కోనేర్లలోకి నీరు రావడం లేదు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.. ఇప్పటికే దాతల సహకారంతో వాటరు ట్యాంకు ఏర్పాటచేశారు. కొళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

- కాకి దేవేంద్ర, భక్తుడు

హుశేనాపురం నుంచి కాలినడకన..



గతంలో హుశేనాపురం నుంచి కాలినడకన వెళ్లి కోనేటిలో స్నానాలచరించేవారం. రాను రానూ కాల్వబుగ్గలో నీరు కరువయ్యాయి. భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కోనేరులతో తాగునీరే కాకుండా సాగునీరు కూడా అందేది. కాల్వబుగ్గపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి.

- జీకే సుధాకర్, భక్తుడు

విద్యార్థులు సరికొత్తగా ఆలోచించాలి



ప్రొఫెసర్లు, విద్యార్థులతో ఇస్రో చైర్మన్

3వ పేజీ తరువాయి

సమగ్ర అభివృద్ధి కోసం ఇంజనీరింగ్ విద్యార్థులు తమ జ్ఞానాన్ని గ్రామాభివృద్ధికి మళ్లించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులు మాతృభూమికి సేవ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అధ్యాపకులు విద్యార్థుల్లో పరిశోధనా స్ఫూర్తిని, నవీనా ఆలోచనల అభివృద్ధిని పెంపొందించాల్సిన బాధ్యత కలిగి ఉన్నారని తెలిపారు. ఐఐఐటీడీఎం కర్నూలుపై తన ఆశయాలను వెల్లడించిన ఆయన ఈసంస్థ త్వరలోనే దేశంలోనే అగ్రగామి విద్యా, పరిశోధన సంస్థల్లో ఒకటిగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆధునికీకరణ, పరిశోధనపై భారత్ ప్రత్యేక దృష్టి పెట్టిందని, దీంతో 2047నాటికి శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మన దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సంస్థ చైర్‌పర్సన్ దేశ్‌మాని విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రపంచస్థాయి సదుపాయాలను అందించడంలో బోధన, పరిశోధనలలో నవీనతను ప్రోత్సహించడంలో తమ సంస్థ కట్టుబడి ఉందని తెలిపారు. ఐఐఐటీడీఎం విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరుస్తున్నారని ఆమె తెలిపారు. ఈ సంస్థను పరిశోధన, వినూత్నతలో కేంద్రంగా అభివృద్ధి చేయడమే తమ దృష్టికోణమని చెప్పారు. డైరెక్టర్ ప్రొ.బీఎస్ మూర్తి మాట్లాడుతూ డిగ్రీ ఒకటే కాదని, దేశానికి అవసరమైన యాక్టివిటీస్, ప్రాజెక్టులు, నాయకత్వ లక్షణాలతో ప్రపంచ స్థాయిలో ఎక్కడైనా రాణించేలా విద్యార్థులను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. గేట్ ప్రవేశ పోటీ పరీక్షలో 200లోపు ర్యాంకులు వచ్చిన వారు కర్నూలు ఐఐఐటీడీఎంలో ప్రవేశాలు తీసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలోనే కర్నూలు విద్యాసంస్థ డ్రోన్ టెక్నాలజీలో ముందంజలో ఉందన్నారు. తమ విద్యాసంస్థలో పని చేస్తున్న 44 మంది బోధన అధ్యాపకులు వివిధ పరిశోధనలు విస్తృతంగా పని చేస్తున్నారని అన్నారు. చదువుతో పాటు పరిశోధనల వైపు విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. విద్య ఒక్కటే కాదు.. స్పోర్ట్స్ మీట్‌లో 36 మెడల్స్, టోర్నమెంట్స్ మెన్స్ విభాగంలో 49 మెడల్స్ సాధించారన్నారు.

206 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం

అనంతరం 206 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ఇస్రో చైర్మన్ నారాయణన్‌తో పాటు బోర్డు చైర్‌పర్సన్ విజయలక్ష్మి, డైరెక్టర్ ప్రొ.బీఎస్ మూర్తి చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఇందులో 183 మందికి బీటెక్, 19 మందికి ఎంటెక్, నలుగురికి పీహెచ్‌డీ పట్టాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ జీవీఎల్ సోమయాజులు, రిజిస్ట్రార్ గురుమూర్తి, ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



పట్టా ప్రదానోత్సవంలో పాల్గొన్న నారాయణన్

తుంగభద్ర నదిలోకి దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన మత్స్యకారులు

మంత్రాలయం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదిలోకి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈఘటన ఆదివారం మధ్యాహ్నం మండలంలో మాధవరం గ్రామ సమీపంలో తుంగభద్రనది బ్రిడ్జి వద్ద చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. ఆదోని పట్టణానికి చెందిన బేల్దార్ నాగరాజు (35) ఇంటి వద్ద ఉన్న సమస్యలు కారణంగా మద్యం సేవించి దాదాపు 20 అడుగులు ఎత్తు ఉన్న బ్రిడ్జి పై నుంచి నదిలోకి దూకాడు. అక్కడి నుంచి కిలో మీటరు వరకు వరదలో ఈత కొడుతూ రక్షించాలంటూ కేకలు వేశాడు. మాధవరం వాగు తుంగభద్ర నదిలో కలిసే ఒత్తుమూల వద్ద పుట్టీలతో చేపలు పడుతున్న మాధవరం గ్రామానికి చెందిన మత్స్యకారులు తెలుగు చిన్నన్న, కుల్ల ఏలియా, మద్దిలేటి గమనించారు. ముళ్లకంపలో ఇరుక్కున్న బేల్దార్ నాగరాజును ప్రాణాలు తెగించి కాపాడి ఒడ్డుకు చేర్చారు. ఆత్మహత్యాయత్నం పాల్పడిన వ్యక్తి ఇచ్చిన సెల్‌నెంబరు ద్వారా ఆదోనిలో ఉన్న బంధువులకు సమాచారమిచ్చారు. హుటాహుటిన బందువులు మాధవరం నది వద్దకు వచ్చారు. నాగరాజును కాపాడిన మత్స్యకారులను గ్రామస్థులు, పోలీసులు అభినందించారు.

వ్యక్తి బలవన్మరణం

ఆదోని, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని ఓ వ్యక్తి బల వన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన నిజాముద్దీన్‌కాలనీలో చోటు చేసుకు న్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వివరాలు.. పట్టణంలోని నిజాము ద్దీన్ కాలనీకి చెందిన ఇసాక్46) అనే వ్యక్తి మానసిక స్థితి కొంతకా లంగా సరిగా లేదు. ఆదివారం ఉదయం అతడు ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. ఖాజీపుర వద్ద ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు కూరగాయల వ్యాపారం చేస్తుండేవాడు. ఆయనకు భార్య షంసున్నీసాతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాణ్యం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

ప్రవాసాంధ్రులను కోరిన గౌరు వెంకటరెడ్డి



గౌరు వెంకటరెడ్డిని సన్మానిస్తున్న ప్రవాసాంధ్రులు

ఓర్వకల్లు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పాణ్యం నియోజకవర్గం అభివృద్ధికి ప్రవాసాంధ్రులు సహకరించాలని టీడీపీ సీనియర్ నాయకులు, నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి కోరారు. అమెరికా పర్యటనలో భాగంగా పెన్సిల్వేనియా రాష్ట్రం చెస్టర్ స్ప్రింగ్స్ నగరంలోని ప్రవాసాంధ్రులతో ఆయన సమావేశమయ్యారు. తానా బోర్డు సభ్యుడు పొట్లూరి రవి నిర్వహించిన ఈ సమావేశంలో ప్రవాసాంధ్రులు గౌరు వెంకటరెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం గౌరు మాట్లాడుతూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పాణ్యం నియోజకవర్గాన్ని పరిశ్రమల హబ్‌గా అభివృద్ధి చేస్తున్నారని, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి నాయకత్వంలో పాణ్యం నియోజకవర్గం హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో కీలక పాత్ర పోషించనుందని తెలిపారు. ప్రవాసాంధ్రులు తమ నైపుణ్యం, పెట్టుబడులతో ముందుకు వచ్చి పరిశ్రమల అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో అనుమల జగదీష్ రెడ్డి, తానా రీజనల్ కో ఆర్డినేటర్ కంతేటి ఫణి, మురళిరెడ్డి, వీర్నాల బాలాజి, కునారపు ప్రసాద్, తుబాటి హరి, చిక్కాల రవి, కోటి యాగంటి, యలమంచి సురేష్, కొండా లక్ష్మినరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అమెరికా పర్యటన ముగించుకొని వచ్చిన గౌరు వెంకటరెడ్డికి శంషాబాద్ విమానాశ్రయంలో టీడీపీ నాయ కులు శ్రీరాములు ఘనంగా స్వాగతం పలికారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గోనెగండ్ల, జూలై 20(ఆంధ్రజ్యోతి): దంపతులిద్దరు పురుగుమందు తాగిన ఘటనలో చికిత్సపొందుతూ భార్య మృతి చెందినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. వివరాలు.. గోనెగండ్లలోని కురువ వీధిలో కురువ పెద్ద ఈరన్న, అంజినమ్మ దంపతులు నివసించే వారు. వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. భర్త పెద్ద ఈరన్న మద్యానికి బానిసయ్యాడు. భర్త పెట్టే బాధలు భరించలేక ఈ నెల 2వ తేదీన భార్య అంజినమ్మ భర్త ఎదురుగానే పురుగుమందు తా గింది. తన కళ్ల ముందే భార్య పురుగుమందు తాగడంతో వెంటనే మిగిలిన పురుగుమందు ఈరన్న తాగేశాడు. ఇద్దరు స్పృహకోల్పోయారు. గమనించిన కాలనీవాసులు చికిత్సనిమిత్తం ఇద్దరిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. మెరుగైన వైద్యసేవల కోసం వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం అంజినమ్మ మృతిచెందింది. మృతురాలి తండ్రి శంకరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

బోధనేతర పనులు అప్పగించకూడదు

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనేతన పనులను అప్పగించకూడదని, పీ-4 రిజిస్ట్రేషన్ పని ఎత్తివేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం యూటీఎఫ్ కార్యాలయంలో ఆ యూనియన్ ఉమ్మడి జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు కేవలం బోధనకు సంబంధించిన పనులు అప్పగించాలని అన్నారు. ఇటీవల కాలంలో బదిలీ, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. ప్రభుత్వ పాఠశాల లను నిర్వీర్యంచేసే విధంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వ హయాం నుంచి ఇప్పటివరకు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, త్వ రలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశా రు. యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కిరణ్‌కుమార్, జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శి రవికుమార్, నవీన్ పాటిల్, నంద్యాల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే



చెక్కును అందజేస్తున్నఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

గూడూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. ఆదివారం పెంచికలపాడు గ్రామానికి చెందిన గోపాల్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పెంచికలపాడు గ్రామానికి చెందిన గోపాల్ భార్య రంగమ్మ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందారని, ఆ బాధిత కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.62వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంజూరు చేయించి అందించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జే.సురేష్ రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ కురువ వెంకట్రాముడు, పెంచికలపాడు ఎంపీటీసీ మద్దిలేటి, టీడీపీ నాయకులు కరణం చిన్నగిడ్డయ్య, నాగేష్, తిప్పన్న, యుగంధర్, నాగసుంకయ్య, తిరుమలేష్, మాదన్న పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కర్నూలు కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని కేంద్రీయ విద్యాలయంలో విద్యాలయంలో చదువుతున్న బాలుడు నాగ హితేష్ అభినవ్ ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న కుస్తీ పోటీలలో తలపడనున్నారు. ఈ నేపథ్యంలో అతనికి రవాణా ఖర్చులకు గాను ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) ప్రతినిధులు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం నగరంలో సుంకేసుల రోడ్డులోని ఆవోపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఈ ఆర్థిక సహాయం బాలుడు గాహితేష్ అభినవ్‌కు అందజేశారు. జాతీయ స్థాయిలో జరగనున్న ఈ పోటీల్లో అభినవ్ మంచి ప్రతిభ కనబరిచి జాతీయ పతకాలతో తిరిగి రావాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీనారాయణ, కార్యదర్శి జీవీ మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు వీసీ నరసింహులు, సభ్యుడు కొత్త కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



నాగ హితేష్ అభినవ్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న ఆవోపా ప్రతినిధులు

'అధికారులపై దురుసు ప్రవర్తన సరికాదు'



మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు

కర్నూలు కలెక్టరేట్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గ్రామ పంచాయతీ అధికారి నాగరాజు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జేసీ ప్రభాకర్ రెడ్డి తీరును నవీన పంచాయతీ కార్యదర్శుల సంఘం ఖండించింది. ఆదివారం విలేకరుల సమావేశంలో కన్వీనర్ గిరి శ్రీకాంత్ మాట్లాడుతూ అధికారులను బెదిరించి తమ పనులు నెరవేర్చుకోవాలనే అహంభావ ధోరణి సరికాదన్నారు. సభ్యత మరిచి దుర్భాషలాడితే ఉద్యోగి స్వామ్యం తప్పక ప్రతిఘటిస్తుందని, అందుకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక సభ్యులు టీఎం నరేష్, వి.మనోహర్, రవికుమార్, హీషాం, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

హామీలపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీయండి

● పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మహిళలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలన అంటూ ఇంటింటికీ వచ్చే కూటమి నాయకులను సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలని నిలదీయాలని పాణ్యం మాజీ ఎమ్మెల్యే, నంద్యాల వైసీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం బాబు ష్యూరిటీ -మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన 19వ వార్డు ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయిస్ కాలనీలో పర్యటించి కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగట్టారు. ప్రజలు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ప్రభుత్వ మోసాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ బివై.రామయ్య, బెల్లం మహేశ్వరరెడ్డిచ ఎన్.గోపాల్‌రెడ్డి కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

కర్నూలు న్యూసిటీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలోని జోహరాపురం - వెంకాయపల్లె రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం పాతబస్తీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం పాతడంప్ యార్డు వద్ద నాయకులు రమణ అధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. రాజశేఖర్ మాట్లాడుతూ వెంకాయపల్లె రోడ్డు వేసి 20 ఏళ్ల అవుతుందని, ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరి గుంతలు ఏర్పడ్డాయన్నారు. రాత్రి సమయాల్లో వాహనదారులు కిందపడి ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహమూద్, రంగస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తం

● 'తొలి అడుగు'లో ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి

కల్లూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేశారని, అన్నిరంగాలను గాడిలోకి తెచ్చేందుకు సీఎం చంద్రబాబు కృషిచేస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితా రెడ్డి అన్నారు. ఆదివారం 20వ వార్డు అరుంధతీనగర్‌లో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి ఎమ్మెల్యే సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి మామీని అమలు చేసేదిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటికే ఎన్టీఆర్‌భరోసా రూ.4 వేలకు పెంపు, దీపం-2 పథకం కింద అర్హత కలిగిన మహిళలకు ఏడాదికి మూడు సిలిండర్లు, తల్లికివందనం, అన్నదాత సుఖీభవ అమలు చేశామన్నారు. ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామన్నారు. అర్బన్ శివారు ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గం అబ్జర్వర్ ఆదెన్న, పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, ఎస్.పిరోజ్, చాంద్‌బాషా, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



20వ వార్డు అరుంధతీనగర్‌లో పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే గౌరుచరిత, నాయకులు

ప్రజలు సుభిక్షం

గూడూరు: కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనలో ప్రజలు సంక్షేమ పథకాలతో సుభిక్షంగా ఉన్నారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కురుకుంద రామాంజనేయులు అన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలో 185వ బూత్ పరిధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ రేమట వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ కోడుమూరు షాషావలి, కె.కుమార్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

● కూటమి ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు జే.సురేష్ అన్నారు. ఆదివారం మండలంలోని జులకల్ గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు.



గూడూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

సి. బెళగల్: కొతకతకోట గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో తాలుకా తెలుగుయువత అధ్యక్షుడు కొత్తకోట హరి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. మండల కన్వీనర్ చంద్రశేఖర్ క్రిష్ణదొడ్డి గ్రామంలో సుపరిపాలనతొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసులు, తిమ్మప్ప, మల్లికార్జున, తిరుమలేసు, గ్రామ సర్పంచ్ రామంజినేయులు పాల్గొన్నారు.

'వైసీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలి'

కర్నూలు అర్బన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు మన్సూర్ ఆలీఖాన్ అన్నారు. ఆదివారం మంత్రి టీజీ భరత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం నగరంలోని 10వ వార్డు టీడీపీ ఇన్‌చార్జీ మెహబూబ్‌ఖాన్‌పై వైసీపీ కార్పొరేటర్ యూనుస్, జావీద్ దాడి చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆపార్టీ నాయకులు మంత్రి టీజీ భరత్ రౌడీలను ప్రోత్సహిస్తున్నారని వ్యాఖ్యలు చేయడంపై మండిపడ్డారు. ఎస్వీ మెహన్‌రెడ్డినే రౌడీలను తయారు చేస్తున్నారని, రౌడీయిజం చేస్తున్న కార్పొరేటర్‌ను మందలించాల్సింది పోయి మంత్రి టీజీపై బురదజల్లడం సరైంది కాదన్నారు. కర్నూలును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఇది ఓర్వలేక లేనే మంత్రిపై ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జకీయా అక్సారీ, కురువ పరమేష్, పద్మలతారెడ్డి, లతీఫ్, క్రాంతి కుమార్, రమణమ్మ, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు అబ్బాస్, 10వ వార్డు ఇన్‌చార్జీ మోహబూబ్ ఖాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

'జగదేకసుందరి సామా' నాటకానికి ప్రశంసలు

కర్నూలు కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి నాటక పోటీల్లో కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన 'జగదేక సుందరి సామా' నాటకం ప్రశంసలు అందుకుంది. ఆదివారం సాయంత్రం తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన జాతీయస్థాయి నాటక ప్రదర్శనల్లో భాగంగా ఈనాటకాన్ని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న పత్తి ఓబులయ్య దర్శకత్వంలో ప్రదర్శించారు. వందేళ్ల చరిత్ర గల చింతామణి నాటకాన్ని తలపించే విధంగా ఒక వేశ్య ఇతివృత్తాన్ని తీసుకొని ఈ నాటకాన్ని రెండున్నర గంటల పాటూ ప్రేక్షకులు ఆసక్తికరంగా తిలకించేలా తీర్చిదిద్దారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ నాటకంలో వేశ్య వృత్తి కలిగిన సామా చేసిన త్యాగనిరతను ఆపాత్ర గొప్పదనం చారిత్రక ఘట్టంగా నిలిచిపోతుందని చెప్పారు. ఇందులో సామాగా ప్రముఖ టీవీ, చలన చిత్ర నటి సురభి ప్రభావతి నటించగా, ఇతర పాత్రల్లో టీజీవీ కళాక్షేత్రం నటులు సీనియర్ నటులు పి. రాజారత్నం, కె. బాలవెంకటేశ్వర్లు, వాల్మీకి రాముడు, జీవీ శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజనేయులు, హసీనా, గాండ్ల లక్ష్మన్న ముఖ్యపాత్రల్లో నటించారు. ఈ కార్యక్రమంలో అభినయ ఆర్ట్స్ సంస్థ అధ్యక్షుడు బీఎన్‌రెడ్డి నాటక దర్శకుడు, కళారత్న పత్తి ఓబులయ్యను, నాటక కళాకారులను శాలువ, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి నగదు బహుమతిని అందజేశారు.



తిరుపతిలో అభినయ ఆర్ట్స్ సంస్థ నుంచి జ్ఞాపిక అందుకుంటున్న పత్తి ఓబులయ్య, కళాకారులు

రోగులు కోలుకోవడంలో

అనస్థీషియా టెక్నీషియన్ల పాత్ర కీలకం

కర్నూలు హాస్పిటల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు సర్వజన వైద్యశాలల్లో అత్యవసర సేవల్లో అనస్థీషియా టెక్నీషియన్‌లు రోగులు కోలుకోవడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని అనస్థీషియా విభాగపు హెచ్‌వోడీ డా.విశాల అన్నారు. జాతీయ అనస్థీషియా, ఆపరేషన్ థియేటర్ టెక్నాలజిస్టు డే ను పురస్కరించుకుని ఆదివారం కర్నూలు జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనస్థీషియా ప్రొఫెసర్ డా.బాలసారయ్యతో కలిసి ఆమె కేక్ కట్ చేశారు. విశాల మాట్లాడుతూ కర్నూలు జీజీహెచ్‌లో అనస్థీషియా టెక్నాలజిస్టులు ఐసీయూ, ఎమర్జెన్సీ విభాగంలో రోగులకు మెరుగైన సేవలు అందించి వారి ప్రాణాలను కాపాడుతున్నారన్నారు. భవిష్యత్తులో ఈ టెక్నీషియన్‌లకు ఆదరణ పెరుగుతుందన్నారు. ప్రభుత్వం అనస్థీషియా టెక్నీషియన్ పోస్టులను పెంచాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డా.రామశివనాయక్, అనస్తీషియా టెక్నీషియన్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. దినేష్, అనస్థీషియా టెక్నీషియన్ ఉద్యోగులు విజయ్‌కుమారి, రేణుక, రాధా, సుధాకర్, బీఎస్సీ, డిప్లమా అనస్తీషియా టెక్నాలజీ విద్యార్థులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ విశాల

శాకంబరిగా మహాగౌరి అమ్మవారు

కల్లూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని మహాగౌరీ అమ్మవారు శాకంబరీదేవి అలంకరణలో పూజలందుకున్నారు. ఆదివారం గుత్తి పెట్రోల్‌బంక్ సమీపంలోని సూర్యనారాయణ ఆలయంలో ట్రస్టు సభ్యుడు, మాతృమండలి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం శాకాంబరీదేవికి షోడషోపచార పూజ, శ్రీదేవీ ఖడ్గమాల, లలిత సహస్రనామ, లలిత త్రిశతి, అష్టోత్తర, దుర్గ అష్టోత్తర లక్షకుంకుమ అర్చనలు విశేషంగా జరిగాయి. అనంతరం భక్తులకు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.



బాలికలకు కరాటే తప్పనిసరి

కర్నూలు స్పోర్ట్స్, జూలై 20(ఆంధ్రజ్యోతి): 8వ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ పూర్తి అయ్యే వరకు విద్యాసంస్థల్లో బాలికలకు ఆత్మరక్షణ కోసం కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఎంతో అవసరమని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డా.శంకర్‌శర్మ అన్నారు. నగరంలోని సంకల్‌బాగ్ చిన్మయ విద్యా మిషన్‌లో ఆదివారం కరాటే మాస్టర్ ఆరిఫ్ ఆధ్వర్యంలో కోయంబత్తూరు వెళ్లి అక్కడి సెమినార్‌లో సర్టిఫికెట్లు సాధించిన క్రీడాకారులకు ఆయన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.



క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



మెడల్స్ చూపుతున్న జిల్లా క్రీడాకారులు

కర్నూలు స్పోర్ట్స్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 19, 20 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన 10వ ఏపీ సబ్ జూనియర్, జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అక్వాటిక్ చాంపియన్‌షిప్-2025లో జిల్లా ఈత క్రీడాకారులు ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించారు. గ్రూప్-1లో బాలుర విభాగంలో వై.దేవసృత్ సాయి 200, 100 మీటర్లు, ఫ్రీస్టైల్‌లో ద్వితీయ స్థానం, 50 మీటర్లు బ్యాక్ స్ట్రోక్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి మూడు సిల్వర్ మెడల్స్, బాలికల విభాగంలో హేమలత 200, 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో ద్వితీయ స్థానం, 100 బెస్ట్ స్ట్రోక్‌లో ద్వితీయ స్థానంలో మూడు సిల్వర్ మెడల్స్, 50 మీటర్లు బ్యాక్ స్ట్రోక్‌లో తృతీయ స్థానంలో నిలిచి బ్రౌంజ్ మెడల్స్ గ్రూప్-2 బాలికల విభాగంలో కురువ శృతి 200 మీటర్లు బ్యాక్ స్ట్రోక్, 800 మీటర్ల ఫ్రీస్టైల్ ఈవెంట్స్‌లో తృతీయ స్థానంలో నిలిచి రెండు బ్రౌంజ్ మెడల్స్ సాధించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను డీఎస్‌డీవో భూపతి రావు, స్విమ్మింగ్ కోచ్ నటరాజ్, డిస్ట్రిక్ట్ అక్వాటిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నరసింహాచారి, రామకృష్ణ యాదవ్ అభినందించారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు



మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి

ఓర్వకల్లు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధిని చూసి ఓర్వకలేకనే వైసీపీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఓర్వకల్లులో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేసుకుంటూ వెళ్తున్నారన్నారు. ఓర్వలేక మాజీ సీఎం జగన్‌రెడ్డి 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' పేరుతో మండలంలో వైసీపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. మండలంలో అభివృద్ధి జరిగిందంటే టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. కార్యక్రమంలో ఓర్వకల్లు గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, బీసీ సెల్ మండల నాయకులు అల్లాబాబు,గుట్టపాడు గ్రామ కమిటి అధ్యక్షులు చిన్న, నాయకులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు ఇళ్లకు పెడితే ఖబడ్దార్

● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు నిర్మల

కర్నూలు న్యూసిటీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు బలవంతంగా ఇళ్లకు పెడితే ఖబడ్దార్ అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఆదివారం పాతబస్తీ కమిటీ ఆధ్వర్యంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు నరసింహులు అధ్యక్షతన పాతబస్తీలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇళ్లకు బలవంతంగా స్మార్ట్ మీటర్లను బిగిస్తే కూటమి ప్రభుత్వానికి భరతం పడతామని ఆమె అన్నారు. ఆగస్టు 5న విద్యుత్ అమరవీరుల సంస్కరణ దినోత్సవం లోపల స్మార్ట్ మీటర్లపై ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే ఈ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుతామ ని హెచ్చరించారు. సమావేశంలో నగర కార్యదర్శులు ఎం.రాజశేఖర్, టి.రాముడు, ఎస్ఎండి.షరీఫ్, సాయిబాబ, రామక్రిష్ణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

● దళితులు, బీసీలు, మైనార్టీలు, రైతులకు నష్టం చేసే స్మార్ట్ మీటర్లను తక్షణమే ఉపసంహరించుకోవాలని కేవీపీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పీఎస్. రాధాక్రిష్ణ అన్నారు. సమితి కార్యాలయంలో జరిగిన కార్యవర్గసమావేశంలో ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాటానికి సమితి పిలుపునిస్తుందన్నారు. సమావేశంలో నగర అధ్యక్షుడు జి.యేసు, కార్యదర్శి ఎం.భాస్కర్, నాయకులు పెద్దబాబు, ఆనంద్, బాబురావు, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అన్యాయం

● మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు న్యూసిటీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అన్యాయమని కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉన్నాడనే అక్కసుతో మిథున్‌రెడ్డిని లిక్కర్ స్కాంలో చేర్చారని ఆరోపించారు. లిక్కర్ స్కాంపై ఇప్పటికి ఎలాంటి ఆధారాలు లేవని, ఎన్ని కోట్ల స్కామ్ జరిగింది కూడా చెప్పడం లేదన్నారు. 10వ వార్డు కార్పొరేటర్ యూనుస్‌భాష కార్యాలయంలపై టీడీపీ నాయకులు దాడి చేయడం హేయమైన చర్యగా అభివర్ణించాలన్నారు. జిల్లాలో ఫ్యాక్షన్ ఉన్న కూడ నగరంలో ఇలాంటి సంస్కృతి లేదన్నారు. మంత్రి స్థాయిలో కర్నూలును అభివృద్ధి చేయాలి..కానీ ఇలాంటి దాడులు మానుకోవాలని ఆయన హితవు పలికారు. సమావేశంలో కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు నయీమ్, వైసీపీ నాయకులు ఆదిమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



శిబిరంలో పాల్గొన్న ప్రజలు

కర్నూలు హాస్పిటల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జోహరాపురం రోడ్డులో ఉన్న అశ్విని హాస్పిటల్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామంలో బెస్ట్ ఫిజీషియన్ డా.శ్రీనివాసరెడ్డి, సీనియర్ గైనాకాలజిస్టు డా.బి.ప్రమీల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో రొమ్ము, గర్భాశయ ముఖద్వారం క్యాన్సర్లకు స్క్రీనింగ్, ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులకు ఉచితంగా వారు పరీక్షలు నిర్వహించారు. ఎముకల సాంద్రత పట్టుత్వ పరీక్ష, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. శిబిరంలో డా.స్ఫూర్తి, డా.కే.విజయలక్ష్మి, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.వి.సురేష్ కుమార్‌రెడ్డి, డా.మేఘాంశ, డా.సాయిసుజిత్ రెడ్డి, డా.లక్ష్మినారాయణరెడ్డి, డా.బి.సౌజన్య, డా.శ్వేత, మాజీ సర్పంచ్ జి.పుల్లారెడ్డి, టీడీపీ నాయకులు రామిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ ఏ.వెంకటస్వామి పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లాలో సత్యసాయి రథోత్సవం

కర్నూలు కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): భగవాన్ పుట్టపర్తి సత్యసాయిబాబా సేవా సంస్థలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం, బుధవారం జిల్లాలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో సత్యసాయిబాబా రథోత్సవం నిర్వహిస్తున్నట్లు సేవా సంస్థల జిల్లా కోఆర్డినేటర్ మాకా అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం కర్నూలు నగరంలో రథయాత్ర ఉంటుందని, సత్యసాయి ప్రేమ ప్రవాహిని పేరుతో నిర్వహిస్తున్న ఈ రథోత్సవం వివిధ ప్రాంతాల్లో గల సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుందని తెలిపారు. పాతనగరంలోని జమ్మిచెట్టు సమీపంలోని శ్రీలలితా పీఠంలో ఇస్కాల సత్రం సమితి వారు మంగళవారం ఉదయం 8 గంటలకు రథోత్సవాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. బుధవారం వెల్దుర్తి, గూడూరు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని ప్రాంతాల్లో రథోత్సవం ఉంటుందని అశోక్‌కుమార్ వివరించారు.

మధ్యంతర భృతిని ప్రకటించాలి

● ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించి 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించి నిత్యావసర ధరల పెరుగుదలకు అనుగుణంగా 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో ఆ యూనియన్ ద్వితీయ కార్యవర్గ సమావేశం గోకారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్సీని అమలు చేయాల్సి ఉండగా ప్రస్తుత ప్రభు త్వం నిర్లక్ష్య ధోరణితో ఉందన్నారు. కేంద్రం విడుదల చేసిన మెమో 57 ప్రకారం 2004 కంటే ముందు నోటిఫికేషన్ విడుదలై పరిపాలన కారణాల వలన తర్వాత నియమితులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 1998, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 12 నెలల పూర్తి జీతం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పూర్వపు ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి టీకే జనార్దన్, గౌరవాధ్యక్షులు రమేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబుతో సంక్షేమ పథకాలు



చిన్నహోతూరులో ప్రజలకు వివరిస్తున్న వైకుంఠం జ్యోతి

ఆస్పరి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు సాధ్యమని టీడీపీ నాయకురాలు వైకుంఠం జ్యోతి పేర్కొన్నారు. ఆదివారం చిన్నహోతూరు గ్రామంలో ఇంటింటికి తిరిగి కూటమి కరపత్రాలు పంపిణీ చేశారు. ఏడాదిలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. మాజీ సర్పంచ్ వరదరాజులు, నెట్టెప్ప తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనకు అండగా నిలవండి

పత్తికొండ (క్రిష్ణగిరి) జూలై 20 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలన అందిస్తున్న టీడీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ప్రజలను కోరారు. ఆదివారం క్రిష్ణగిరి మండలం కోయిల కొండ గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రజలతో మట్లాడారు. వైసీపీ అరాచక పాలనతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, అయితే టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందన్నారు. సర్పంచ్ లక్ష్మీశ్వర్‌గౌడ్, ఆలంకొండనబి, మర్రిశ్రీరాములు, రఫి, హరిశంకర్, శేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సమస్యలను పరిష్కరించుకుందాం



సభ్యులను సన్మానిస్తున్న కట్టమంచి రామలింగా రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కలిసికట్టుగా ప్రైవేటు స్కూల్ యాజమాన్యాల సమస్యలు పరిష్కరించుకుందామని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (అపుస్మా) వ్యవస్థాపక అధ్యక్షుడు కట్టమంచి రామ లింగారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని నేషనల్ ఇంగ్లీష్ మీడియంపై హైస్కూల్‌లో గోపాల్ రెడ్డి అధ్యక్షతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర మెంబర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వాసుదేవయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజ్ పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా మహానందయ్య వ్యవహరించారు. ఆదోని గౌరవాధ్యక్షుడిగా గోపాల్ రెడ్డి, అధ్యక్ష కార్యదర్శులుగా నాగేంద్ర, కృష్ణమూర్తి, ఆర్థిక కార్యదర్శిగా దశరథ రాముడును ఎన్నుకున్నారు. దూద్‌బాషా, ఇంతియాజ్, సుధాకర్ రెడ్డి, కేశవ నారాయణ రెడ్డి, చిన్నప రెడ్డి, రమేష్ బాబు ఉన్నారు

అన్ని రంగాల్లో ముందుకు..



ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసిన టీడీపీ నాయకులు

దేవనకొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకెళుతోందని టీడీపీ నాయకుడు నాయకంటి రాజశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక బీసీ కాలనీ, ఎర్రగోటిగేరి, కొట్టాల కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. సర్పంచ్ భర్త మాల బండ్లయ్య, పట్టణ అధ్యక్షులు మస్తాన్, తిమ్మయ్య, రాముడు, చెన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

పల్లెలను అభివృద్ధి చేస్తాం



జొన్నగిరిలో కరపత్రాలు ఇస్తున్న తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెలను అభివృద్ధి చేస్తామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు అన్నారు. ఆదివారం రాంపల్లెలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, హేమాద్రినాయుడు, చెన్నకేశవులు, శ్రీనివాసులుగౌడు, వెంకటస్వామి ఉన్నారు.

358 మందికి వైద్య పరీక్షలు

ఆదోని టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఆదివారం రక్తనాళాల ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు ఆవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్త తెలిపారు. 358 మందికి రక్త నాళాల పరీక్షలు, కంటి పరీక్షలను నిర్వహించామన్నారు. వీరిలో 76 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు తెలిపారన్నారు. శిబిరాన్ని వ్యాపారవేత్త రాచోటి సుధాకర్ ప్రారంభించగా ఏషియన్ వాస్కులర్ ఆసుపత్రి (హైదరాబాద్)కు చెందిన వైద్యులు డాక్టర్ సాయి తేజ, శాంతరాం ఆసుపత్రి(నంద్యాల)కు చెందిన డాక్టర్ సురేష్ హాజరై వైద్య పరీక్షలను నిర్వహించారు. యాదగిరి వెంకటేశ్వర్లు, రత్నయ్య, రామకృష్ణ, వంకదారు మమతా శ్రీ, నాయకంటి శ్రీదేవి, సంతోషి, ప్రసన్న పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యుడు

కూరగాయాలు

- ఆలూరులో పెరిగిపోయిన కూరగాయల ధరలు
- బీన్స్, చిక్కుడు రూ.100, మిరప రూ.80లు.. మిగతావి రూ.50-60లు
- సాగు తగ్గడం, రైతు బజార్ లేకపోవటమే కారణం



ఆలూరులో వ్యాపారులు విక్రయించే కూరగాయలు

కూరగాయ	ధర(కిలో)
బీన్స్	రూ.100
చిక్కుడు	రూ.100
మిర్చి	రూ.80
క్యాప్సికం	రూ.70
క్యారెట్	రూ.60
కాకర	రూ.50
బీర	రూ.60
బీట్‌రూట్	రూ.50
దొండ	రూ.50
బెండకాయలు	రూ.60

ఆలూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కూరగాయల ధరలు కొండెక్కాయి. ఏ కూరగాయ కొనాలన్నా ధరలు ఎక్కువగా ఉండటంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. జూలై వచ్చినా వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో రైతులు కూరగాయలను సాగు చేయలేదు.

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి..

వినియోగదారులు ఎక్కువగా ఉపయోగించే మిరప, క్యారెట్, బీట్‌రూట్, బీన్స్, క్యాబేజీ, క్యాప్సికం అందుబాటులో లేవు. ఈ కూరగాయలను చిత్తూరు జిల్లా మదనపల్లి, కర్ణాటక రాష్ట్రంలోని చిత్రదుర్గ, ధార్వాడ మార్కెట్‌ల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో వాటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. గత 15 రోజుల్లోనే ధరలు పెరిగాయి. బీన్స్ చిక్కుడు రూ.100లకు చేరగా మిరప రూ.80లు పలుకుతోంది. మిగతావి రూ.50ల నుంచి రూ.60ల వరకు పలుకుతున్నాయి.

రైతు బజారు లేకపోవడంతో..

ఆలూరు పట్టణంలో అధికారులు రైతు బజారు ఏర్పాటు చేయలేదు. దీంతో ఇక వ్యాపారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. ఎంత ధర చెబితే అంతకే కొనాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. స్థానికంగా రైతు బజారు ఏర్పాటు చేస్తే రైతులే మార్కెట్‌కు తీసుకొచ్చి విక్రయిస్తారని ధరలు అందుబాటులో ఉంటాయని లాభంతో వినియోగదారులు కోరుతున్నారు.

రైతు బజార్ ఏర్పాటు చేయాలి



కూరగాయల ధరలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో రూ.500లు తీసుకెళ్తే మూడు రోజులకు సరిపడా కూరగాయలు కూడా రావడం లేదు. ఇది సామాన్యుడికిగా భారంగా మారింది. ఆలూరులో ప్రభుత్వం రైతు బజార్ ఏర్పాటు చేయాలి. **- ప్రసాద్, వినియోగదారుడు, ఆలూరు**

రైతులు ముందుకు వేస్తే రైతు బజార్ ఏర్పాటు



ఆలూరులో రైతు బజార్ ఏర్పాటుకు షెడ్లు అందుబాటులో వున్నాయి. పదిమంది దాకా రైతులు ముందుకు వస్తే ఏర్పాటు చేస్తాం. రైతులు కూరగాయలు తెస్తే ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకువచ్చి అభివృద్ధి చేస్తాం **- సునీత, కార్యదర్శి, మార్కెట్ యార్డు**

వీహెచ్‌పీ శిక్షణ తరగతులు

ఆదోని టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆ సంస్థ కార్యాలయంలో వీహెచ్‌పీ శిక్షణ తరగులను కార్యదర్శి హనుమంతురెడ్డి నిర్వహించారు. యువకులు, మహిళలకు దిశా నిర్దేశం చేశారు, భీమిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, వీరన్న రావు, రాధారెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

తుగ్గలి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తుగ్గలి, జొన్నగిరి ఎస్‌ఐలు బాల నరసింహులు, మల్లికార్జున సూచించారు. ఆదివారం తుగ్గలి, జొన్నగిరి పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహనాలను తనిఖీ చేసి, వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకోకూడదన్నారు.

పీఆర్సీ నియమించాలి

ఆదోని అగ్రికల్చర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయు కోసం 12వ పీఆర్సీని నియమించాలని ఎస్‌టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసీ సుంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం మాట్లాడుతూ 11వ పీఆర్సీ గడువు ముగిసి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు నియమించకపోవడ తగదన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం



హనుమాన్ నగర్ ప్రజలతో మాట్లాడుతున్న మీనాక్షినాయుడు

ఆదోని, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అండగా పని చేస్తోందని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, పరిశీలకుడు ధర్మవరం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని హనుమాన్ నగర్‌లో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉమాపతి నాయుడు, రంగస్వామి నాయుడు, శ్రీకాంత్ రెడ్డి, రామస్వామి, శంకర్, అంజనప్ప, తదితరులు పాల్గొన్నారు.

పొంచి వున్న ముప్పు



పట్టణంలోని ఎస్కేడీ కాలనీ 4వ రోడ్డులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె శిథిలావస్థకు చేరింది. పగుళ్లు ఏర్పడటంతో విద్యుత్ అధికారులు ఒక కర్రను పెట్టారు. ఏమాత్రం అదుపు తప్పినా ప్రజల ప్రాణాలకే ప్రమాదంగా మారే అవకాశం ఉంది. సమీపంలోనే ప్రైవేటు పాఠశాల ఉంది. నిత్యం ఈ రహదారిలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. విద్యుత్ అధికారులు స్పందించి దిమ్మెకు శాశ్వత మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. - ఆదోని

శిథిలావస్థలో మార్కెట్ యార్డ్ భవనం



పెచ్చులూడిన పైకప్పు

ఆదోని అగ్రికల్చర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ అదనపు కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. చైర్మన్ ఛాంబర్, సీసీ కెమెరాల సర్వర్, కంప్యూటర్ గదితో, పాలకవర్గం సమావేశం హాలు ఉంది. పైకప్పు శథిలావస్థకు చేరడంతో పెచ్చులూడుతోంది. ఇనుప కడ్డీలు తేలినా అధికారులు పట్టించుకోవడం లేదని ఉద్యోగులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు తావిస్తున్నాయి.

అందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి



ఉద్యోగులను సన్మానిస్తున్న నాయకులు

ఆలూరు రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని హత్తిబెళగల్ గ్రామ సర్పంచ్ షేకునబీ, మోడల్ స్కూల్ విద్యాకమిటీ చైర్మన్ విశ్వేశ్వరయ్యస్వామి, పంచాయతీ కార్యదర్శి జిలాన్ బాషా అన్నారు. ఆదివారం గ్రామ సచివాలయంలో బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులు విష్ణు, తిరుపాల్, శిరీష, మహేష్, రమాదేవి, స్వప్నను సన్మానించారు. జగదీష్‌స్వామి, ధనుంజయ, డీలర్ గురుస్వామి పాల్గొన్నారు.

ఎస్సీ రుణాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

మద్దికెర, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, ఆదోని ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఉలింద్ర యేసుబాబు డిమాండ్ చేశారు. ఆదివారం మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీలపై దాడులకు పాల్ప డటం సిగ్గు చేటన్నారు. మల్లికార్జున, వైసీపీ నాయకులు ఉన్నారు.

షాదీఖానా ఆక్రమణ



ఆలూరులో ఆక్రమణకు గురైన షాదీఖానా స్థలం

ఆలూరు, జూలై20(ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని షాదీఖానా స్థలం ఆక్రమణకు గురవుతోంది. 15 ఏళ్ల క్రితం నాటి మంత్రి మారెప్ప ముస్లింల సౌకర్యార్థం స్థలాన్ని కేటాయించారు. కాగా ఈ స్థలాన్ని మెనార్టీలు, అధికారులు పట్టించుకోకపోవడంతో కొందరు బంకులు ఏర్పాటు చేసుంకుటున్నారు. అధికారులు స్పందించి, ఆక్రమణలు తొలగించాల్సి ఉంది.

సమస్యలు పరిష్కరించాలి



నాయకులను కలిసిన చందు నాయక్

తుగ్గలి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి చందు నాయక్ కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు కరీముల్లా చౌదరి, కార్యదర్శి ప్రవీణ్, కిరణ్‌ను కలిసి జోనల్ గేమ్స్ నిర్వహించాలని విన్నవించారు. ప్రతి పాఠశాలలో క్రీడా మైదానం ఉండేలా చూడాలని, విద్యార్థులకు పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. స్పందించిన నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సొసైటీ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న అప్పా వేణుగోపాల్

తుగ్గలి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామని ఉప్పర్లపల్లి సొసైటీ సింగిల్ విండో అధ్యక్షుడు అప్పా వేణుగోపాల్ అన్నారు. ఆదివారం మాట్లాడుతూ ఈ నెల 25న అధ్యక్షుడిగా తాను ప్రమాణ స్వీకారం చేస్తానన్నారు. తనను ఎంపిక చేసిన ఎమ్మెల్యే శ్యాంబాబు నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతు సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

జోరుగా వరినాట్లు



దేవనకొండ మండలంలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

దేవనకొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువకు నీరు విడుదల చేయడంతో ఖరీఫ్‌లో రైతులు జోరుగా వరినాట్లు వేస్తున్నారు. మండలంలోని కరివేముల చెరువు కింద 247 ఎకరాలు ఉండగా, మిగతా పొలాలతో కలిపి మొత్తం మీద 450 ఎకరాల్లో వరి సాగుకు సిద్ధమయ్యారు.

గుంతలదారి



మండలంలోని పెద్దతుంబళం రహదారిలోని కుప్పగల్ వద్ద రోడ్డుపై గుంతలు పడ్డాయి. ఇప్పటికే కొందరు ప్రమాదాల బారిన పడ్డారు. రాత్రిళ్లు గుంతలు కనబడకపోవడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. అధికారుల స్పందించి మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. **- ఆదోని రూరల్**

పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆలూరు రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం నాయకుడు బి.రామాంజనేయులు, ఎండీ ఆనంద్ బాబు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం జ్యోతిబసు భవనం రెండో రోజు శిక్షణ ఇచ్చారు. మారుతున్న రాజకీయ సమీకరణలను అర్థం చేసుకుని నిజాయితీగా పనిచేస్తే పార్టీ నిరంతరం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలను మభ్యపెట్టి, అమలులో విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు, కె.పి.నారాయణ స్వామి, కృష్ణమైన, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

చెట్లను నరికేస్తున్నారు



చెట్టును నరికి పాతిన విద్యుత్ స్తంభం

మద్దికెర, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గ్రామం నుంచి ఎడవలికి వెళ్లే రహదారి పక్కన ఉన్న చెట్లను అడ్డంగా విద్యుత్ కాంట్రాక్టర్ నరికేస్తున్నారు. చెట్లు లేని స్థలంలో స్తంభాలు ఏర్పాటు చేస్తే చెట్లను కాపాడవచ్చునని పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు. ఇలా చెట్లను నరికివేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ బురుజుల విజయుడు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విద్యుత్ ఏఈ మహ్మద్ రఫీ మాట్లాడుతూ పరిశీలించి కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

ప్రణాళికతో పారిశుధ్య నిర్వహణ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● ఎం.అగ్రహారం కార్యదర్శి విజయకుమార్



మద్దికెర, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనుల నిర్వహణకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి విజయకుమార్ తెలిపారు.

ప్రశ్న: గ్రామ జనాబా ఎంత?

జవాబు: గ్రామంలో 12వేల మంది ఉన్నారు. దాదాపు 2వేల ఇళ్లు ఉన్నాయి. ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేస్తున్నాం.

ప్రశ్న: పంచాయతీ అభివృద్ధికి చర్యలు తీసుకున్నారా?

జవాబు: సర్పంచ్ బురుజుల విజయుడు సహకారంతో ప్రభుత్వ నిధులతో రూ.25 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాం.

ప్రశ్న: దోమల నివారణకు చర్యలు తీసుకున్నారా?

జవాబు: గ్రామంలోని మురుగు కాలువల్లో పూడిక తీయించి, బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణ మందులు పిచికారీ చేయించాం.

ప్రశ్న: తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నారా?

జవాబు: 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయిస్తున్నాం.

ప్రశ్న: వీధి దీపాలు పనిచేస్తున్నాయా?

జవాబు: వీధి లైట్లు పనిచేయకపోతే మరమ్మతులు చేయిస్తున్నాం.

ప్రశ్న: కార్మికులు ఎంతమంది ఉన్నారు?

జవాబు: స్వచ్ఛభారత్ పరిధిలో మొత్తం 18 మంది కార్మికులు పని చేస్తున్నారు. వారికి సకాలంలో జీతాలు ఇస్తున్నాం.

ప్రశ్న: సీజన్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకుంటున్నారా?

జవాబు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా వైద్యసిబ్బంది ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. తాగునీటిలో బ్లీచింగ్ పౌడర్ కలుపుతున్నాం.

ఎమ్మిగనూరు

● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

మోతాదు మించితే ముప్పే

● అవసరం మేరకే యూరియా వాడాలి ● లేకపోతే భూ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ● సలహాలు తీసుకోవాలంటున్న అధికారులు



గోనెగండ్ల, జూలై 20(ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడుల కోసం కొందరు రైతులు పరిమితికి మించి యూరియా (నత్రజని) వాడుతున్నారు. ఈ పద్ధతి ఆందోళన కలిగిస్తోంది. కొందరు రైతులు ఎంత యూరియా పోస్తే పంట దిగుబడి వస్తుందనే ఆలోచన ఉంది. ఎక్కువ యూరియా వాడకంతో నేల ఆరోగ్యం దెబ్బతిని, చౌడు భూమిగా మారిపోతుంది. కౌలురైతులు మరీ ఎక్కువగా యూరియాను వాడుతున్నట్లు సర్వేల్లో తెలుస్తోంది. ప్రస్తుతం పడుతున్న వానల కారణంగా యూరియాను రైతులు తమ పంటలకు పైపాటుగా వేస్తున్నారు. ఎమ్మిగననూరు డివిజన్ గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు, మంత్రాలయం పరిధిలోని 1లక్షా 50వేల ఎకరాలలో పంటలు సాగు చేశారు. అందులో 1లక్ష 20వేల ఎకరాలలో పత్తిని సాగు చేశారు. ఎరువులలో తక్కువ ధరకు దొరికేది కేవలం యూరియా మాత్రమే అందుచేత ఎక్కువ మంది రైతులు పైపాటుగా వేస్తున్నారు. యూరియాను ఎకరం కూ 30 నుంచి 35 కిలోలు వేయాల్సి ఉండగా ప్రస్తుతం రైతులు 50 నుంచి 75 కిలోలు వేస్తున్నారు. ఈ కారణంగా సాగు చేసిన భూములు దెబ్బతింటున్నాయి.

పంటను బట్టి యూరియా వాడాలి: యూరియా వాడకం పంటను బట్టి మారుతుంది. వరి పంటకు యూరియాను బురద పదునులో వేయాలి. దీనివల్ల యూరియా నుంచి విడుదల అయిన అమ్మోనియా నేలకు అంటిపెట్టుకొని వేర్లుకు అందుబాటులో ఉంటుంది. పత్తి పంటకు యూరియా వేసేటప్పుడు భూమి పైన కాకుండా మొక్కల దగ్గర గుంత తీసి అందులో వేసి మట్టి కప్పాలి. పద్ద గుళికల యూరియాను వరి పైరుకు వేయడం వలను నత్రజని లభ్యత ఎక్కువ రోజులు ఉంటుంది. చౌడు నేలల్లో పండించే పంటలకు యూరియాను తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు వేసుకోవాలి.

యూరియాను అధికంగా వాడితే నష్టమే

యూరియా నత్రజని పోషకం మిగతా పోషకాల కంటే అధికంగా పంటకు అవసరం. కానీ యూరియా పొలంలో వేసిన వెంటనే నీటిలో కరిగి భూమి లోపలికి పొరల్లోకి భూగర్భజలాల్లోకి చేరి నష్టం జరగుతుంది. కొంత భాగం గాలిలో అవిరైపోతుంది. ఈ విధంగా వృధాగా పోయిన తరువాత పంట మొక్కలకు మనం వేసిన యూరియా లో కేవలం 30 నుంచి 35 శాతం మాత్రమే అందుతుంది. యూరియాను అవసరానికి మించి పంటకు వేయడం వలన మొక్కలు పెలుసుబారి పంట మొత్తం పురుగుల రోగాల బారిన పడుతుంది. అందుకే యూరియాను సరైన మొతాదులో మాత్రమే వేసుకోవాలి. యూరియాతో పాటు పంటలకు భాస్వరం పోటాష్, యూరియా అనేక సూక్ష్మపోషకాలు అవసరం ఉంటుంది. వీటి ఎరువుల ధర కాస్త ఎక్కువగా ఉండటంతో రైతులు ఎక్కువగా వాటిని వినియోగించడానికి ఇష్ట పడటం లేదు. రైతులు ఏ ఎరువైన ఒక్కటేలే అని నమ్మి ఎక్కువగా యూరియాను వాడుతున్నారు. దీని వలన భూమూలు కాలుష్యానికి గురవుతూ పంటలు చీడలు బారి న పడి పెట్టుబడుల ఖర్చులకు తగిన విధంగా దిగుబడి రావడం లేదు.

భూ సమతుల్యతపై ప్రభావం

యూరియాను అవసరానికి మించి పొలంలో వేస్తే నేల నిస్సారంగా మారిపోతుంది. మొక్కకు కావాల్సిన పోషకాల సమతుల్యత దెబ్బతింటుంది. సూక్ష్మపోషకాల లోపాలు అధికమవుతుంది. యూరియాను అధికంగా వాడటంత్లో మొక్కలో శాఖీయోత్పత్తి పెరిగి చీడపీడలల ఉధృతి పెరుగుతుంది. భూగర్భ జలాలు నైట్రేట్, నత్రజనితో కలుషితం అవుతాయి. నేలలో పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయి. యూరియాలో ఆమ్ల స్వభావం కలిగి మందు కావున దీన్ని ఎక్కువగా వాడితే నేలకూడా ఆమ్ల భూమిగా మారిపోతుంది.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న యూరియా

భూమి సమతుల్యత దెబ్బతింటుంది



పంట భూముల్లో యూరియాను ఎక్కువగా వాడితే భూమి సమతుల్యత దెబ్బతింటుంది. భూభౌతిక స్థితిలో మార్పు వచ్చి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడమే గాక ఎరువులను కరిగించుకొని మొక్కలకు అందించే గుణం కూడా తగ్గిపోతుంది. పోషకాల సమతుల్యత దెబ్బతింటుంది. దీనికి రైతులు దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. నేలలో సేంద్రియ కర్బనం పెంచుకోవాలి. వరిని కోసిన తరువాత కాల్చకుండా రోటవేటరి పద్ధతిలో భూమిలో కుళ్లిపోయే విధంగా చూడాలి. జీవ ఎరువులను వాడటం పచ్చిరొట్టే సాగు చేసి భూమిలో కలియ దున్నాలి. పశువుల ఎరవులను వాడటంతో భూమిలో సేంద్రియ కర్బనం పెరుగుతుంది. మొక్కలకు పోషకాలు సక్రమంగా అంది పంట చేతికి వస్తుంది. కావులన రైతులు యూరియాను ఎక్కువగా వాడకుండా తగిన మోతాదులోనే వాడాలి.

● మహమ్మద్‌ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు

అంగన్‌వాడీ కేంద్రానికి దారేదీ?



సూగూరులో అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ నిలిచిన నీరు

మంత్రాలయం, జూలై 20(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని సూగూరు గ్రామంలో 4వ అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ వర్షం నీరు నిలిచి ఉండటంతో లోపలికి ఎటువెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. చిన్న పాటి వర్షానికి అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ కాలువలు పొంగిపొర్లి నీరు, మురుగు నిలిచి ఉండటంతో అంగన్‌వాడీకి పిల్లలు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీరాజ్ ఏఈతో మాట్లాడి వర్షం నీరును తొలగించి గ్రావెల్‌తో నింపాలని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అంగన్‌వాడీ టీచర్ తెలిపారు. గ్రామంలో ఈ పరిస్థితుల్లో అంగన్‌వాడీ కేంద్రం తమ పిల్లలను పంపించాలంటే తల్లిదండ్రులు వెనుకంజ వేస్తున్నారనీ, వెంటనే అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాల్సినదారిని శుభ్రం చేయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

పెద్దకడుబూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నిరంజన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు అలజడులకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. గొడవలు, వివాదాలకు దూరంగా ఉండి సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. చెడు నడత కలిగిన రౌడీషీటర్ల కదిలికలపై పోలీస్ నిఘా ఉంటుందని హెచ్చరించారు.

నందవరం సహకార సంఘం చైర్మన్‌గా గోపాల్



నందవరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): నందవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా ధర్మాపురం గోపాల్ నియమితులయ్యారు. గోపాల్ మాట్లాడుతూ ఈ పదవి అప్పజెప్పిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి రుణపడి ఉంటానని అన్నారు. మండల కూటమి నాయకులకు, టీడీపీ కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా చూస్తానన్నారు. రైతులకు రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు నందవరానికి ఎమ్మెల్యే రాక: నందవరానికి సోమవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి రానున్నట్లు టీడీపీ మండల పార్టీ కన్వీనర్ కాశీంవలీ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండల సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా ధర్మాపురం గోపాల్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే రానున్నట్లు చెప్పారు

విద్యార్థుల అ'పూర్వ' కలయిక

మంత్రాలయం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 2008-09లో పదో తరగతి విద్యార్థులు 17ఏళ్ల తర్వాత అపూర్వ కలయిక జరుపుకున్నారు. ఆదివారం మాధవరం జడ్పీ ఉన్నత పాఠశాల వేదికపై అప్పటి గురువులు ముక్కురన్న, రాఘవేంద్ర, గురురాజ్, సుజాతలను ఘనంగా సన్మానించారు. వారికి మెమెంటోలు అందించి పూలమాలలు వేసి సత్కరించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, నరసింహులు, నాగప్ప, ముల్ల జమీర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

'ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తా'

మంత్రాలయం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తను గుర్తించుకుని న్యాయం చేస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మాధవరం గ్రామంలోని తన నివాసంలో రాఘవేంద్రరెడ్డిని, మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాగన్న, అబ్రహం, శివరాముడు, వంశీ, రాకేష్ రెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ యువ నాయకుడు రాకేష్‌రెడ్డి

కోసిగి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, త్వరలో అన్నదాత సుఖీభవ పథకం అమలు అవుతుందని టీడీపీ యువ నాయకుడు ఎస్.రాకేష్ రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తు రెడ్డి, రామిరెడ్డి అన్నారు. అగసనూరు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రభుత్వం అందించిన పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆర్లబండ సహకార సంఘం చైర్మన్ నాడిగేని అయ్యన్న, టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ, చింతలగేని నర్సారెడ్డి, అంజిరెడ్డి, నాడిగేని చిన్న తాయన్న పాల్గొన్నారు.

వెండి గజవాహనంపై ప్రహ్లాదరాయలు



వెండి గజవాహనంలో స్వర్ణ అంబారిపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): శ్రీమఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ అంబారి పై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం ఆషాఢ బహుళ దశమి శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి, మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య వెండి గజవాహనంపై స్వర్ణ అంబారిలో ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగాణం చుట్టూ ఊరేగించారు.

నేడు ఏకాదశి- పూజలు బంద్: శ్రీమఠంలో సోమవారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, పరిమళ ప్రసాదం, టెంకాయ కొట్టడం బంద్ చేస్తారు. రాఘవేంద్రస్వామి నిజ బృందావనానికి భక్తులు దర్శించుకొనే అవకాశం మాత్రమే శ్రీమఠం అధికారులు కల్పించనున్నారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, పండితులు, అర్చకులు, శ్రీమఠం ఉద్యోగులు ఉపవాసం పాటిస్తారు.

'రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది'

మంత్రాలయం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని, ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమమని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తన నివాస గ్రామమైన రాంపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డికి వస్తున్న ఆదరణ ఓర్వలేక వైసీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసీపీ విజయం సాధించడం ఖాయమన్నారు.

'ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి'

మంత్రాలయం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని టీటీడీ బోర్డు మాజీ సభ్యులు సీతారామిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ మండల అధ్యక్షులు గురెడ్డి భీమిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ సీవీ విశ్వనాథరెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, మాలపల్లి సత్యనారాయణరెడ్డి, కరణం గురురాజరావు, మధుసూదన్ రెడ్డి, పాల్గొన్నారు.

'జిల్లా అధికారిని బెదిరించడం తగదు'

కోసిగి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తాడిపత్రిలో జిల్లా అధికారిని జేసీ ప్రభాకర్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని డిప్యూటీ ఎంపీడీవో అసోసియేషన్ జిల్లా నాయకులు, కోసిగి ఇన్‌చార్జి ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అనంతపురంలో జిల్లా అధికారిని నోటికొచ్చినట్లు అసభ్య పదజాలం మాట్లాడడం ఎమిటని ప్రశ్నించారు. ఈ చర్యను ఖండిస్తున్నామన్నారు.

నవోదయ విద్యాలయం విజ్ఞాన భాండాగారం

● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి



హాజరైన ఎమ్మెల్యే, ప్రిన్సిపాల్, పూర్వ విద్యార్థులు

ఎమ్మిగనూరు జూలై 20(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయం ఒక జ్ఞాన భాండాగారమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బనవాసి నవోదయ విద్యాలయంలో అలుమిని, వెల్ఫర్ ట్రస్టు ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపు, విద్యార్థినులకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ తన తండ్రి దివంగత నేత బీవీ మోహన్‌రెడ్డి హయాంలో ఏర్పాటైన నవోదయ విద్యాలయం అభివృద్ధికి అలుమిని అసోసియేషన్ విద్యార్థులు పాటు పడటం అభినందనీయమన్నారు. మార్గదర్శకులుగా ఉంటూ విద్యాలయం అభివృద్ధిలో పాలు పంచుకోవటం సంతోషకరమన్నారు. అనంతరం బచ్చు జానకీరామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యాలయంలో చదువుతున్న 200మంది బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయగా ఓ విద్యార్థినికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి స్వయంగా వ్యాక్సిన్ వేశారు. అలాగే రక్తదాన శిబిరంలో దాదాపు 100మంది రక్తదానం చేశారు.

రూ. 30లక్షలతో బీటీ రోడ్ల మరమ్మతులకు భూమి పూజ

జవహర్ నవోదయ విద్యాలయంలో డీఎంఎఫ్‌టీ నిధులురూ. 30 లక్షలతో చేపట్టనున్న అంతర్గత రోడ్ల మరమ్మతులకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, మార్కెట్ కమిటీ చైర్మన్ కురువ మల్లయ్య, ట్రస్టుసభ్యులు కడప జిల్లా న్యాయాధికారి ప్రవీణ్ కుమార్, డాక్టర్ బాబుల్ రెడ్డి, బచ్చు జానకీరామ్ ఫౌండేషన్ సభ్యులు డా రవీంద్ర బాబు, డా. సాయివాణి, ట్రస్టు సభ్యులు సృజన, బోర్డు ఆఫ్ ట్రస్టు రమేష్ సాగర్, క్రాంతినాయుడు, మధుమతి, డీఈ నాగరాజు, ప్రభు, టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, రాళ్లదొడ్డి మురళీ రెడ్డి, కేటీ వెంకటేశులు, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

మోసం చేయడం బాబుకే సాధ్యం : బుట్టా రేణుక



బాబు షూరిటీ - మోసం గ్యారెంటీ ఫ్లెక్సీతో వైసీపీ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు బాబు షూరిటీ - జాబు గ్యారెంటీ తో ప్రతి ఒక్కరికి జాబు గ్యారెంటి అని హామీలు ఇచ్చి మోసం చేయడం బాబుకే సాధ్యం అని బుట్టా రేణుక అన్నారు. పట్టణంలోని కుర్ని కళ్యాణ మండపంలో జరిగిన మండల స్థాయి సమావేశంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ నిరుద్యోగులకు బాబు వస్తే జాబు గ్యారెంటీ అని అధికారంలోకి వచ్చిన ఆయన యువతను మోసం చేయడం గ్యారంటీ అని అన్నారు. ముఖ్యమంత్రిగా చేసిన జగన్మోహన్ రెడ్డిని ఏకవచనంతో మాట్లేడేటప్పుడు మనస్థాయి ఏంటో తెలుసుకోవా లని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డికి సూచించారు. మిథున్‌రెడ్డి అక్రమ ఆరెస్ట్ తగదని ఒక ఎంపీ హోదాలో ఉన్న వ్యక్తి ఎక్కడ తప్పు జరిగిం ది చూపించండి అని అడి గితే కూడా చూపించకుండా అక్రమంగా అరెస్ట్ చేయడం తగదని అన్నారు.

తుమ్మిగనూరులో రోడ్డు ప్రమాదం



నుజ్జునుజ్జయిన ట్రాక్టర్, బైక్

కోసిగి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుమ్మిగనూరు గ్రామ సమీపంలో కోసిగి, తుంగభద్ర ఆర్టీసీ బస్సును మంత్రాలయం మండలం నానాపురం గ్రామానికి చెందిన ట్రాక్టర్ వేగంగా ఢీకొనడంతో బస్సు, ట్రాక్టర్ భాగాలు దెబ్బతిన్నాయి. అలాగే పక్కనే ఉన్న బైక్‌ను ఢీకొనడంతో ట్రాక్టర్, బైక్ 33/11కేవీ విద్యుత్ స్థంభంలోకి ఇరుక్కుపోయి రెండు వాహనాలు నుజ్జునుజ్జయినయ్యాయి. విద్యుత్ స్థంభం ఇరుక్కుపోయి గాల్లో వేలాడుతుండటంతో స్థానిక రైతులు, బస్సులో ఉన్న ప్రయాణీకులకు పెను ప్రమాదం తప్పింది. ఏఎస్ఐ తిరుపాల్ నాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా కూడా ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో బస్సులోని ప్రయాణికులు, ట్రాక్టర్ డ్రైవర్లు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు.